# ప్రేమ పరీక్ష

శ్రీమతి పరాంకుశం రాజామణిగారు

వెంకట్రావుగారు రిటైర్డు తహసీల్దారు. ఆయనకు కమల ఒక్కతే కూతురు. ఆమె 5వ ఏటనే తల్లి చనిపోయింది. చిన్నప్పటినుంచి పల్లెటూరిలో మేనత్తవద్ద పెరిగింది. ఇప్పుడు కమల చదువుకోసం పట్నం తండ్రివద్దకు వచ్చింది. ఆమె బి. ఏ. చదువుతూంది. అన్నివిధాలా కమల గుణవంతురాలు. చక్కనిది. కల్లకపటాలు ఎరగనిది. అందర్నీ ప్రేమిస్తుంది. ప్రేమలో ఉచ్చనీచాలు తెలియవు. తను అందర్నీ ఎలా ప్రేమిస్తుందో అందరూ తన్ని అలానే ప్రేమిస్తారని అనుకుంటుంది. ఆమెకు తండ్రి అన్ని విషయాలలోను సంపూర్ణ స్వాతంత్ర్యం ఇచ్చాడు. ఆమెకు పెండ్లిచేయాలనే తండ్రి ఉద్దేశ్యం. కాని కమల ఇష్టంలేనిదీ దీనికి ప్రయత్నం చేయడు. కమల ఎంచుకున్న వరునికిచ్చి పెండ్లిచేయాలనే చూస్తున్నాడు.

ఒకనాడు మాటల సందర్భంలో "అమ్మా! నీకు వివాహంచేసి నా బాధ్యత తీర్చుకోవాలి. నీవు ఎవరినైనా వరుని వరించిఉంటే చెప్పు, తప్పక పెండ్లిచేస్తాను" అని అన్నాడు వెంకట్రావు.

"నాన్నగారూ! నా వివాహానికి తొందర ఏమిటి? మీరు ఉండగా నాకేమిభయం?"

"అలా అనకమ్మా! ఎల్లకాలం నేను బతుకుతానా? నేను ఉండగానే నీకు మరో ఆధారం ఏర్పరచవద్దూ" అని అన్నాడు.

"అలాగేలెండి నాన్నగారూ చూద్దాం" అని అన్నది కమల. "చూడమ్మా! అదిగాక మరోసంగతి. నీకు మేనత్త కొడుకు ఒకడు ఉన్నాడు. ఆసంగతి నీకు తెలుసుననుకుంటాను. అతనికి నిన్ను ఇచ్చి వివాహంచేయాలని మీఅమ్మ చనిపోతూ మరీమరీ చెప్పింది. అతనినే వివాహం చేసుకోవాలని నేను చెప్పను. కాని నీకు ఎవరు ఇష్టమైతే వారినే నీవు చేసుకోవచ్చును" అని అన్నాడు. కమల తన గదిలోకి వెళ్లిపోయి ఆలోచిస్తూ కూర్చుంది. మానవజీవితంలో వివాహం ఒక పెద్ద సమస్య. ఆ జన్మాంతమూ ఒక పురుషునితో కష్టసుఖాలు అనుభవించుతూ కాలం వెళ్లబుచ్చాలి. నేను ఎవరిని ప్రేమిస్తున్నాను. అందర్నీ ప్రేమిస్తున్నాను. ఇంట్లో నాన్నగార్ని, నౌకర్లను ప్రేమిస్తున్నాను. దూరంగా ఉన్న బావను అత్తను ప్రేమిస్తున్నాను. అందర్నీ ప్రేమిస్తున్నాను. ప్రత్యేకప్రేమ ఉండాలా పెళ్లిచేసుకోడానికి? ప్రత్యేకప్రేమ అంటే ఎలావుంటుంది? నాన్నగారు ఇంకో మాట అన్నారు. నీకు మేనత్తకొడుకు ఒకడు ఉన్నాడు. అతనికిమ్మనమని మీఅమ్మ చెప్పింది చచ్చిపోయేముందు. మా బావ చాలా మంచివాడే. మేము చిన్నప్పుడు ఎంతో హాయిగా ఆడుకునేవాళ్లం పల్లెటూరిలో. కాని ఇప్పుడో, తను చాలా మారిపోయింది. బావకూడా మారిపోయి ఉంటాడు. బావ బి. ఏ. వరకూ చదువుకున్నాట్ట. ఆ పల్లెటూరులోనే "జాతీయ పాఠశాల" అనే పేరుతో పిల్లలకు ఒక స్కూలు నడుపుతున్నాట్ట. ఆ స్కూల్లో నూలువడకటం, తోటపని, పరిశ్రమలు మొదలైనవన్నీ నేర్పుతారట. బావ ఎప్పుడూ ఖద్దరే కడతాడుట. మా అత్తకూడా చాలా మంచిది. బావతో సమానంగా నన్ను చూసేది. ఎన్నాళ్లయిందో వాళ్లనుచూసి. అని ఆలోచించుకుంటూంది కమల. గడచినరోజులన్నీ సినీమాలోలాగ ఒక్కసారి ఆమె కళ్లముందు తిరిగిపోయాయి. ఇప్పుడు పెద్దసమస్య తన వివాహం. తన కాలేజీచదువు పూర్తి అయితేనేకాని వివాహం చేసుకోదు. కాలేజీ స్టూడెంట్సుతోకూడ తను ఎంతో సరదాగా, హాయిగా ఉంటుంది. కాని ఇందులో ప్రేమించి పెళ్లిచేసుకోనే తావు ఎక్కడా కనిపించదే. తన స్నేహితులు—మోహన్, గోపాలం, వేణు ఇంకా ఎందరో ఉన్నారు. వారందరినీ, తను ప్రేమిస్తుందే. అయితే ఎవరిని పెళ్లిచేసుకోవడం. వారి ప్రేమ ఎలాంటిది? తను ఎప్పుడూ విమర్శచేయ దలచుకోలేదు. కాని ఇవాళ తప్పిందికాదు. మోహన్ ఇప్పుడు తనతో మాట్లాడకు, తను మోహన్ని

పెళ్లిచేసుకోలేదని. ప్రేమించేవారందరినీ పెళ్లి చేసుకోవాలా? ఇదేనా ప్రేమ? పెళ్లి చేసుకుని వారి కోర్కెలన్నీ నెరవేరిస్తే మంచివారు. లేకపోతే చెడ్డవారు. స్త్రీకిమాత్రం తన జీవితం మీద తన కోర్కెలమీద హక్కులేదా? పాపం విమలగతి ఏమైంది? తను ఆమె అక్కచెల్లెళ్లవలె కాలేజీలో చదువుకొనేవారు. ప్రేమించి పెళ్లిచేసుకుంటానని నమ్మించి ఆమెను భంగపరచి ఒక విద్యార్థి మరోగొప్పవారి పిల్లను పెళ్లిచేసుకున్నాడు, తల్లిదండ్రుల కోర్కెమీద. పాపం ఆమె ప్రాణత్యాగం చేసుకుంది. ఇదేనా మర్యాద? మగ జాతిలో ఇటువంటికుళ్లు నశిస్తేనేగాని దేశం బాగుపడదు. అని ఏమేమో ఆలోచిస్తూ ఆ రోజంతా గడిపేసింది కమల.

కొన్నిరోజులు గడిచాయి.

ఒకనాడు వెంకట్రావు ఏదో ఉత్తరం వచ్చిందని, కమలకు ఇచ్చాడు చదవమని. అది కమల తీసి చూసింది. అది బావదగ్గరనుంచి వచ్చిందే. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవంనాడు తన పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవం చేస్తారట. మామను, కమలను రమ్మనమని అందులో ఉంది.

“ఏమమ్మా! మనం ఊరికి వెళ్దామా” అని అన్నాడు. వెంకట్రావు.

“అలాగేనండి వెళ్దాం. అత్తను, బావనుచూసి ఎన్నాళ్లయిందో” అని నవ్వుతూ అంది కమల.

ఆ మర్నాడే ఊరికి ప్రయాణం కట్టారు.

స్టేషనుకు ఒక నాటుబండి తీసుకువచ్చాడు, గోపాలరావు. అక్కడినుండి నాల్గుమైళ్లు ప్రయాణంచేస్తే వాళ్లఊరు వస్తుంది. అనుకున్నట్టుగా ఆ రైలులోనే దిగారు, తండ్రీ కూతురూను. చిరునవ్వునవ్వుతూ వారికి స్వాగతం ఇచ్చాడు, గోపాలరావు. కుశలప్రశ్నలు అయింతర్వాత బండి ఎక్కి వాళ్ల ఊరువెళ్లారు.

స్వాతంత్ర్యోత్సవం 3 రోజులు అతివైభవంగా చేశారు. ఆ వుత్సవాల్లో పాల్గొని వెంకట్రావు కమల చాలా సంతోషించారు. కమల, వచ్చినప్పటినుంచి, గోపాలరావు నడవడిక బాగా పరిశీలిస్తోంది. ఆమెకు ఎందులోనూ లోటు కనిపించలేదు. ఆ వినయం, మర్యాద, మాటల పొందిక, నిరాడంబరం తన్ని బాగా ఆకర్షించాయి. పట్నంలో మోహన్ మొదలైన కొంతమంది తన స్నేహితులు తనయందు కనబరిచే కాముకప్రేమకన్న ఈ బావప్రేమ ఎన్నోరెట్లు విలువగలది. పవిత్రమైంది. ఆ ప్రేమకు ఈ ప్రేమకు చాలా వ్యత్యాసం ఉంది.

మర్నాడు పట్నం వెళ్లిపోదామని వెంకట్రావు, కమల నిశ్చయించుకున్నారు. ఆనాడు మధ్యాహ్నం భోజనాలయి నాక సావిట్లోకూచుని వెంకట్రావు, ఆయన అక్క సుబ్బమ్మ మాట్లాడుతున్నారు.

సుబ్బమ్మ—తమ్ముడూ! నువ్వు, నేను ముసలివాళ్లం అయిపోయాముగదా. ఇంక నీకూతురికి, నాకొడుక్కు పెళ్లిచేసి ఏదో వాళ్ల కాపురంచూస్తూ, మనం రామా కృష్ణా అనుకుంటే పోదూ! ఇంక నీకుమాత్రం ఎవరున్నారు, నాకుమాత్రం ఎవరున్నారు? ఇందులో నీ ఉద్దేశ్యం ఏమిటి?

వెంక—నాకు దాని వివాహం త్వరలో చేయాలనే ఉన్నది. కాని కమల ఇష్టం లేనిది నేనేమీ చెప్పలేను.

సుబ్బ—సరే, నీవు ఏసంగతిచెప్తే నేను తర్వాత ఆలోచించుకోవాలి. వాడిని ఒక ఇంటివాణ్ణిచేస్తే నా బాధ్యత తీరిపోతుంది.

“అలాగేనమ్మా!” అని వెంకట్రావు లేచిపోయాడు. సాయంత్రం అయింది. “అలా షికారు వెళ్లివద్దామా, గోపాలరావు? కమలా, నీవుకూడా రామ్మా!” వెంకట్రావు, కమల, గోపాలరావు షికారు వెళ్లారు. గోపాలరావు ఖద్దరు లాల్చీ, ఖద్దరువధోతీ కమలకు చాలా ఆకర్షణీయంగా కనపడుతున్నాయి. గోపాలరావుని ప్రేమిస్తున్నానా? అని ప్రశ్నించుకుని నవ్వుకుంది కమల.

“కమలా, ఎందుకలా నీలో నువ్వే నవ్వుకుంటున్నావు?” కమల ఉలిక్కిపడిచూచింది. ఎదురుగుండా గోపాలరావు నవ్వుతూ నిల్చున్నాడు.

“నాన్నగారు ఏరి?” అని అడిగింది, ఆత్రుతగా కమల.

“మీనాన్నగారు అలా నదిఒడ్డుకు వెళ్లారు, ఇప్పుడే వస్తారు” అని అన్నాడు, గోపాలరావు.

"ఇక్కడ హాయిగా గాలివేస్తోంది, ఇక్కడ కూర్చుందామా కమలా?"

"అలాగే" ఇద్దరూ అక్కడ కూర్చున్నారు.

"కమలా నీకు ఈవూళ్లో ఏమీ తోచడం లేదుగదూ!"

"అలవాటయితేసరి, అదే తోస్తుంది" అంది ముక్తసరిగా కమల.

"చూడు, కమలా! నేను చిన్నప్పటినుంచీ నిన్ను ప్రేమిస్తున్నాను గదా. నా ప్రేమకి ఫలితం ఏమిటి?"

"నేను ప్రేమించడమే నీ ప్రేమకు ఫలితం."

"అయితే, మనిద్దరికీ ప్రేమగలిగినప్పుడు మన వివాహానికి ఆటంకం ఏమిటి?"

ప్రేమ, పెళ్లి—ఈ రెండుమాటలు రాగానే వెనక మోహన్‌కు తనకు జరిగిన సంభాషణ జ్ఞాపకం వచ్చింది. ఛీ! ఆప్రేమ ఎక్కడ, ఈ ప్రేమ ఎక్కడ? ఆ ప్రేమ కాముక ప్రేమ, ఈ ప్రేమ నిష్కలంకమైన పవిత్ర ప్రేమ అని తనలో తనే అనుకుంది.

"కమలా! మాట్లాడవేమి?" అని గోపాలరావు ఆమె చేయి పట్టుకున్నాడు.

"బావా! నీప్రేమ, నీమర్యాద, నీనిరాడంబరం నాకు చాలా సంతోషాన్ని కలుగచేస్తున్నాయి. నేను నిన్ను తప్ప మరొకర్ని వివాహం చేసుకోను. ఇదుగో, నేను నీ కమలనే" అని గోపాలరావుకి కమల నమస్కరించింది. గోపాలరావు కమలను లేవనెత్తి తన హృదయానికి చేర్చుకున్నాడు.



కులాసా : శ్రీ కవికొండల వేంకటరావు

"స, సరి, సరిగ, సరిగ సారీ, మగసిపని సరిగ సారీ!" అని అడిగిందట ఓ భార్య జరీచీర తెమ్మని మగనికి పనిపురమాయిస్తూ, తనకు వచ్చిన సంగీత ధైర్యం సాగదీస్తూ! మగడు వెంటనే "సరిసరి, సరిగ గరిగమ, పదపద, మగసిపని సరి, 'సా' సరి సరిగ 'సారీ'" అని తప్పించుకొన్నాట్ట! జరీచీర గరిగమ్మవంటిదైనట్టు, రంపంలాంటిదైనట్టు, వాటిల్లా గీసుకుకోసుకు పోతుందన్నట్టు అభినయిస్తూ. ['సా' అంటే SAW = రంపం. 'సారీ' అంటే SAREE = చీర. సరిగ = జరీ. గరిగమ = తాటిముట్ట.]

★